
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా,  తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ,  స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే  జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు..  ఈ మహానగరం కథలు..!!

# రక్షణ

వీధి తలుపు తెరిచి బెరుగ్గా అటూ ఇటూ చూసింది ప్రార్ధన. బయట ఎవరూ లేరని నిర్ధారణ చేసుకున్నాకా కాలు బయట పెట్టింది. తెల్లగా సన్నగా పొడుగ్గా ఉంటుంది ప్రార్ధన. సన్నజాజిమొగ్గలాంటి సుకుమారమైన రూపంలాగే సుతిమెత్తని మనసు.. మహా పిరికి పిల్ల. తోడు లేకుండా కాలేజీకి తప్ప ఎక్కడికీ వెళ్ళదు.తల్లి ఏదైనా అన్నా, గట్టిగా ఎదురు చెప్పలేదు. తన పనేదో, తానేదో అన్నట్టుగా ఉంటుంది. చాలా అందమైన పిల్ల . సాధారణ మధ్యతరగతి కుటుంబం, తండ్రి చిన్న ఫాక్టరీలో సూపర్ వైజర్ గా పనిచేస్తాడు. అమ్మ గృహిణి.

" ఉండు ఒక్కదానివీ వెళ్ళకు. నేను తోడు వస్తాను బస్ దాకా" అంది సత్యవతి, ప్రార్ధన తల్లి.

" ఒక్కరోజైతే వస్తావు గానీ రోజూ ఎలా  వస్తావమ్మా? ఏం చెయ్యాలో అర్ధం కావడం లేదు" అంది ప్రార్ధన మళ్ళీ భయంగా.

"రేపటి సంగతి రేపు చూద్దాం. ఈ రోజు నన్ను రానీ!  మేకుకు తగిలించి ఉన్న సంచీ భుజానికివేసుకుంది" అంటూ చెప్పులు వేసుకుని బయలుదేరింది సత్య.. నువ్వన్నది నిజమే, ఎన్నాళ్ళిలా? ఈ రోజు ఏదో ఒకటి తేలాల్సిందే!  అనుకుంది మనసులో.

ఇల్లు తాళం వేసి బయటకొచ్చారిద్దరూ. ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది ప్రార్ధన. ఇది కాక, మరొక్క సంవత్సరం అయిపోయి, ఉద్యోగం వస్తే అమ్మా, నాన్నలకి భారం తగ్గించాలనీ, తమ్ముడిని చదివించాలనీ ఆమె కోరిక. చాలా మామూలు కోరికలు. నవకాలపు హంగులూ, ఆర్భాటాలూ, మహానగరపు కొత్తరకాల పోకడలకూ దూరంగా ఉండే అమ్మాయి. రెండు ఫర్లాంగులుంటుందేమో బస్ స్టాప్. .

పది అడుగులు వేశారో లేదో ఎక్కడనించి వచ్చాడోతెలియకుండానే బైక్ మీద సర్రున వీళ్ళని తాకినట్టే వచ్చి ఆగాడు  జగన్..

" హాయ్ డార్లింగ్, రోజూ కన్నా బావున్నావే !ఇవ్వాళ. కొరుక్కు తినేయాలనిపిస్తోంది!" చూస్తుంటేనే. అన్నాడు విలాసంగా ఒక కాలు నేలమీద ఆనించి తన బైకుకున్న అద్దంలో జుట్టు సవరించుకుంటూ.. చాలా ఖరీదైన బైక్ అది. అదొక్కటే కాదు, వేసుకున్న బట్టలూ, పెట్టుకున్న కళ్ళజోడూ అన్నీ అతనికున్న అంతస్థునీ, డాబునీ చూపిస్తున్నాయి.

ప్రార్ధన బెదురుగా తల్లి చెయ్యి పట్టుకుంది. సత్యవతి కూడా అతన్ని  చూడనట్టుగా గబ గబా అడుగులు వెయ్యసాగింది. ఊరికి కాస్త చివరిగానే ఉంటుంది వారుండే కాలనీ. అద్దె తక్కువని కాస్త విసిరేసినట్టుగా ఉన్న ఇళ్ళల్లో ఒకటి అద్దెకి తీసుకున్నాడు ప్రార్ధన తండ్రి పురుషోత్తం. ప్రార్ధన చదువుకోసమనే వాళ్ళు పట్నానికి వచ్చినది, మొదట ఉండే చోట ఇంటి అద్దె, ఖర్చు ఎక్కువగా ఉందని ఈ మధ్యనే మారారు ఇక్కడికి.

అతని అదృష్టవశాత్తూ ఒక కొలీగ్ దగ్గరలోనే ఉండడం వల్ల చాలా సార్లు అతనితో వెళ్ళే అవకాశం లభిస్తుంది. ప్రార్ధన తమ్ముడికి స్కూల్ బస్ ఉంది. ప్రార్ధన మాత్రం రోజూ బస్ స్టాప్ దాకా నడిచి వచ్చి కాలేజీకి బస్ ఎక్కి వెళ్ళవలసినదే. మొదట్లో బాగానే ఉండేది. ఇంటి పని తక్కువగా ఉన్నప్పుడు సత్యవతి తోడుగా వచ్చి దించి వెళ్ళేది బస్ స్టాప్ వరకూ.. ఈ మధ్యన కొద్దిగా కుట్లూ, ఎంబ్రాయడరీలు పెట్టుకోవడం వల్ల పని పెరిగింది. దానితో ఎప్పుడైనా మాత్రమే వస్తోంది.

" ఏంటే! అమ్మా కూతుళ్ళిద్దరూ చూడనట్టు పోతున్నారు, చెట్టంత మగాడినిక్కడ కనిపిస్తుంటే?" అన్నాడు పెద్ద జోక్ వేసినట్టుగా నవ్వుతూ..

" గట్టిగా మాట్లాడితే పాతికేళ్ళు లేవు, వీడు చెట్టంత మగాడా?" సత్యవతికి అంత కోపంలోనూ  నవ్వొచ్చింది.

" చూడబ్బాయ్! ఈ వెర్రి వేషాలు మాని బుద్ధిగా చదువుకుంటే బావుంటుంది" అంది. అంత కంటే గట్టిగా అనాలని ఉన్నా, తనదో, కూతురిదో చెప్పుతో తన్నాలని ఉన్నా కానీ ఏదో అసహాయత, కొద్దిగా పిరికితనం" ఇప్పుడిప్పుడే కూడగట్టుకుంటున్న ధైర్యం.

" ఏంటత్తయ్యా? మళ్ళీ చెప్పు! కాబోయే అల్లుడితో ఇలాగేనా మాట్లాడడం" అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

" చూడయ్యా! నీకు చాలా సార్లు చెప్పాము ఇప్పటికే, ఊరికే వెనక పడడం నీకు బావుందా? దయచేసి మరింకేమీ గొడవచెయ్యకుండా ఇక్కడనించి వెళ్ళు" అంది తనే.

ప్రార్ధనని మొదటిసారి ఆ కుర్రాడు కలిసిన రోజు ఆమెకింకా గుర్తే. అదొక్కటే కాదు అప్పటినించీ ఆ పిల్ల పడుతున్న బాధా, అది చూస్తూ కూడా ఏమీ చెయ్యలేని తన నిస్సహాయతా అన్నీ గుర్తే.

-----------------

ఒకరోజుపరుగు పరుగున ఇంట్లోకి వచ్చి, తలుపు గడియ పెట్టి రొప్పుతున్న ప్రార్ధన ని చూసి కంగారుగా అడిగింది సత్య..

" ఏమయింది తల్లీ? ఏమిటా కంగారు?" అని.. భోరున ఏడవడం మొదలుపెట్టిన కూతురిని చూసి గాభరా పడిందామె తల్లి హృదయం

" అరే! బంగారు తల్లీ!! ఎందుకురా ఏడుపు? ఏమయిందో చెప్పు!" అంది..

అప్పుడు చెప్పింది ప్రార్ధన.. బస్ స్టాప్ లో తనని జగన్ అనే అబ్బాయి కలిసిన సంగతి..

" అమ్మా! అతనెవరో నాకు తెలీదమ్మా! పెద్ద బైక్ మీద వచ్చి బస్ స్టాప్ లో నిల్చున్న నన్ను చూసి చాలా చిరాగ్గా మాట్లాడాడు. నేనంటే ఇష్టమట, నేను ఊ అంటే పెళ్ళి చేసుకుంటాడుట. లేకపోయినా పరవాలేదట.. ఇంకా చాలా అసహ్యంగా మాట్లాడాడు.. ఏం చెయ్యాలో తెలీలేదు. కాలేజీకి కూడా వెళ్ళకుండా పరిగెత్తుకుని వెనక్కి వచ్చేశాను. నాకేమిటో చాలా భయంగా ఉందమ్మా!” అంది..

అవన్నీ విన్న సత్యవాతి ఒక్క క్షణం స్తబ్దుగా నిలబడిపోయింది. కూతురికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో కూడా తెలియలేదు ఆమెకి.

" ఊరికే కూసే గాడిదలెన్నైనా కూస్తాయి, మన మానాన మన పని చేసుకుని పోవడం తప్ప ఇవన్నీ పట్టించుకోకూడదూ అని చెప్పాలో?

" తిరిగి ఏమనకమ్మా, వాడేదైనా చేస్తే కష్టం, నష్టం మనకే" అని పిరికి మందు పొయ్యాలో?

" ఎదురు తిరిగి రెండు వాయించక పోయావా వాడిని? అని ధైర్యంగా చెప్పాలో? ఏమీ తెలియని అయోమయంలో ఉండిపోయింది.

" వయసుతో సంబంధం లేకుండా యువకులు చేసే కామెంట్లూ, చర్యలూ, జరుగుతున్న సంఘటనలూ.. ఇవన్నీ ఆమె మనసులో తిరిగాయి గిర్రున.

" ఎవరో, ఏమిటో తెలియదంటున్నావు కదా! చూద్దాం, మళ్ళీ వస్తేనాన్నకి చెప్దాం" అంది, ఆమెకీ తెలుసు అది ఏ రకంగానూ సరి అయిన సమాధానం కాదని.

కానీ అది ఒక్కరోజు జరిగి ఆగిపోయిన విషయం కాలేదు. దాదాపు ప్రతీ రోజూ వెనక పడి వేధించసాగాడు జగన్.

" ఏం చూసుకునే నీకీ పొగరు? అందంగా ఉన్నావనే కదా?" అనేవాడు ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా వెళ్ళిపోయినప్పుడు.

" నీ బాబేమైనా పెద్ద గూండా అనుకుంటున్నావా? మా సంగతి నీకు తెలీదు. గట్టిగా మాట్లాడితే నీ ఇంటికి వచ్చి మీ అందరి పనీ పడతా." అంటూ బెదిరించేవాడు ఆమె ఏదైనా సమాధానం చెప్తే.

" చిన్న పిల్ల, దాని బాధ చూడలేకపోతున్నా, పోనీ పోలీస్ కంప్లైంట్ ఇస్తేనో?" అంది సత్య ఒకరోజు. కూతురిని మించిన పిరికివాడు పురుషోత్తం.

"నీకేమైనా మతిపోయిందా? పోలీసులు మనలాంటివారి ఇంటికొస్తే మన పరువేమౌతుంది?" అని భార్య మీద ఎగిరాడు.

" పోనీ ఇల్లు మారిపోదాం" అంది భర్త కోపాన్ని చూస్తూ మరేం చెయ్యాలో తెలీక..

" ఇప్పటిప్పుడు మనకింత చవకలో ఇల్లు దొరకడం అంటే మాటలు కాదు, పైగా ఇచ్చిన ఎడ్వాన్స్ కూడా వెనక్కి రాదు" అంటున్న భర్త మీద పీకల్దాకా కోపం వచ్చింది సత్యకి.

" పిల్లకేదైనా అయితే?" అంది భయంగా.

" ఏమీ అవదు, ఈ ఆడపిల్లలేమీ తక్కువ వాళ్ళు కాదు, సినిమాలు చూసి పాడయిపోతున్నారు" అన్నాడు పురుషోత్తం

" సినిమాలు చూసి పాడవుతున్నది మగపిల్లలు. నేన్నిన్ను ప్రేమించాను, నువ్వు నన్ను ప్రేమించాల్సిందే అంటూ అర్ధం పర్ధం లేని మాటలు మాట్లాడుతూ, ఆవారాల్లా రోడ్లు కాస్తూ అసభ్యంగా, అసహ్యంగా మాట్లడడాలు, అదేదో హీరో లక్షణాలు అనుకోవడాలూ చేస్తున్నది అబ్బాయిలు. వాళ్ళనేమీ అనకుండా కూతురినే తప్పు పట్టిన భర్తని చూస్తే చిరాకు వచ్చింది సత్యకి. ఊరికే వాదన పెంచుకోవడం తప్ప ప్రయోజనం లేదని గ్రహించి

" మరేం చేద్దామో మీరే చెప్పండి? అదేమో వీధిలోకి వెళ్ళడానికే భయపడుతోంది. పెద్దదాన్ని నాకే భయంగా ఉంది వాడినీ, వాడితో తిరిగే పిల్లలనీ చూస్తూ ఉంటే"అంది నిస్సహాయంగా.

" చూద్దాం!" అన్నాడు పురుషోత్తం. అతనికీ మరో ఆలోచనేమీ రాలేదు.

"ఏం చూద్దాం? దాని మీద వాడు ఏ యాసిడో పోసేవరకూ చూద్దామా? లేదా ఏ కత్తో తెచ్చి రెచ్చిపోయేవరకూ చూద్దామా? ఏం చెప్తే మీకర్ధం అవుతుంది?"

" కాలేజీ వరకూ దాని బస్ వెనకే వెళతాడు ఇంచు మించు రోజూ. బైక్ ఎక్కమని రోజూ వెంట పడుతున్నాడు. ఎలాగైనా తననే ప్రేమించాలనీ, లేదంటే చంపేస్తాననీ అన్నాడుట. ఎందుకు తోచిందో, ఏమో తనకి చిన్నప్పుడే తన అత్తకొడుకుతో పెళ్ళి కుదిరిందని అబద్ధం చెప్తే, తనని కాదని మరొకరిని పెళ్ళాడితే ఇద్దరినీ చంపేస్తానన్నాడుట. ఇదేమిటి? దీన్ని ప్రేమంటారా? బాధ్యత లేని వయసు, చిన్నతనం అనుకోమంటారా? చిన్నతనం ఇలాంటి భయంకరమైన మాటలు మాట్లాడిస్తుందా? అసలు మనుష్యుల్ని చంపేయడం ఏమిటి? అదేమైనా చిన్న పనా? రోజూ పేపర్లలోనూ, టీ.వీల్లో వచ్చే వార్తలు చూస్తూ ఉంటే ప్రతీ రోజూ పిల్ల ఇంటికొచ్చేవరకూ నా మనసు మనసులో ఉండడం లేదు. వీలున్నంతవరకూ రోజూ దిగపెట్టి, తీసుకుని వస్తున్నాను" అంది సత్య..

" ఏదో చిన్నతనం! దీన్ని ఏమీ మాట్లాడవద్దను" అన్నాడు పురుషోత్తం..

" ఎలా నాన్న? మాట్లాడకుండా ఉండడం? జడ పట్టుకుని లాగాడు, చెంప దెబ్బ కొట్టాలనిపించింది. మీరైతే ఏం చేస్తారో చెప్పండి. నేనసలు చదువే మానేస్తాను" అంది ప్రార్ధన ఏడుస్తూ..

" చదువు మానెయ్యడం పరిష్కారం కాదమ్మా! మానేస్తే నాలాగే బట్టలు కుట్టుకుని బ్రతకాలి. చూస్తాను, నేనే దీనికేదైనా మార్గం చూస్తాను" మొదటి సగం పైకి అని మిగతా సగం మనసులో అనుకుంది సత్య.

అదంతా గుర్తు తెచ్చుకుంటూనే జగన్ తో అంది..

" నీకు చాలా సార్లు ప్రార్ధనా చెప్పింది, నేనూ చెప్పాను. అయినా నువ్విలా చెయ్యడం మంచి పద్ధతి కాదు,నా మాట విని మా అమ్మాయిని వెనక పడడం మానెయ్యి" అంది గట్టిగానే.

" అత్తయ్య గొంతు లేస్తోందిరోయ్! అల్లుడినెంత మర్యాదగా చూసుకోవాలో తెలీడం లేదు" అన్నాడు జగన్ వెకిలిగా అప్పటికే తనతో చేరిన ఇద్దరు స్నేహితులతో.. వాళ్ళిద్దరూ మరో బైక్ మీద వచ్చారు అప్పటికే.

" ఇన్ని సార్లు చెప్పే ఓపిక నాకు లేదు. ఇప్పటికి మూడునెలలుగా సతాయిస్తున్నావు మా అమ్మాయిని. దాని ఆశలు వేరు, ఆశయాలు వేరు. నీ సంగతి మాకు తెలీదు, అవసరం లేదు. కనక నువ్వు, నీ స్నేహితులతో కలిసి మర్యాదగా ఇక్కడనించి వెళితే బావుంటుంది" అంది కోపంగా. ఉదయాన్నే కావడాన రోడ్డుమీద రద్దీ లేదు, ఇక్కడింత జరుగుతున్నా, వెళ్ళే ఒకరిద్దరు కూడా కనీసం ఏం జరుగుతోందా? అని తెలుసుకోవడానికైనా సరే ఆగి చూడకపోవడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది...

" ఎక్కడున్నాం మనం? జనారణ్యమా ఇది? మాహారణ్యమా? ఒకరి ఊసు ఒకరికి పట్టదా?" అనుకుంది బాధగా.

" ఆంటీ బెదిరిస్తోందిరోయ్!!" అన్నాడు జగన్ స్నేహితుడు రాజు..

" మరే! ఏంటాంటీ? ఏంటి కథ? ఏం చేస్తావేం? " అంటూ ముందుకు రాబోయాడు. రెండోవాడు.

" అమ్మా ఇంటికి వెళ్ళిపోదాం దామ్మా!" అంటోంది ప్రార్ధన. అప్పటికే ఆ అమ్మాయి కళ్ళనిండా నీళ్ళు.

అప్పుడు తీసింది సత్య తన భుజానికి వేళ్ళాడుతున్న సంచీలోంచి రెండు సీసాలు. మొదటిది స్ప్రే లా ఉంది, ఇంట్లో దోమలకీ, ఈగలకీ కొట్టేలాంటిది. రెండోది గాజు సీసా..

" ఆగరా అక్కడ" అంది ముందుకు వస్తున్న రెండో స్నేహితుడిని.. పెద్దగా అరవకపోయినా ఆమె మాటల్లోని స్థిరత్వాన్ని, కఠినత్వాన్నీ గుర్తించినట్టుగా ఒక్క క్షణం ఆగాడు వాడు.

" ఏమన్నావ్? ఏం చేస్తానా అని కదూ! ఇదిగో చూడు. ఇది నా కూతురికి ఇస్తాను, పెప్పర్ స్ప్రే, మీ ముగ్గురి కళ్ళల్లో కొట్టడానికి నిమిషం చాలు.. ఇంక నాచేతిలోది ఏమిటో తెలుసా? మీలాంటి పోకిరీవెధవలందరూ కంటికి నదురుగా కనబడే ఆడపిల్లలనందరినీ 'మీద పోస్తాం, మీద పోస్తాం' అంటూ బెదిరిస్తారు చూశావా? అదే .... యాసిడ్.. అంటూనే మూత తీసి జగన్ బైక్ కి తనకీ మధ్య ఉన్న చోట కాస్త పోసింది. భగ్గుమనడమే కాక బుస బుస పొంగుతూ పొగలు కక్కింది ఆ ద్రావకం.

" ఏమె, ఒసే.. నీకు దొ....దే! లాంటి అశ్లీలమైన, అసహ్యకరమైన మాటలు మీరు మాట్లాడితే మాట్లాడవచ్చు. పనికిరాని సినిమాలు చూసి మీరు అదే హీరోయిజం అనుకోవచ్చు. కానీ గట్టిగా అరిచి డైలాగులు చెప్పడానికి నాకు తీరిక లేదు, ఓపిక అంతకన్నా లేదు. ఇదే మీ ముగ్గురికీ చెప్తున్నాను. మరోసారి వీడు మా అమ్మాయి వెంట పడ్డాడంటే ఫలితం మాములుగా ఉండదు. ముందే చెప్తున్నా. చుట్టుపక్కల అన్ని పోలీస్ స్టేషన్లలోనూ చెప్పి వచ్చాను. ఆపైన మీ ఇష్టం.మాట్లాడితే చంపుతా, నరుకుతా, యాసిడ్ పోస్తా అనడానికి ఇదేమైనా ఆట అనుకున్నార్రా? మీ అమ్మా, నాన్నలెవరైనా కానీ నాకు సంబంధం లేదు. నా కూతురికన్నా నాకేదీ ముఖ్యం కాదు. దగ్గరలోని మహిళా పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ సుధారాణిగారికి అన్నీ చెప్పి వచ్చాను. పనికిమాలిన వేషాలు వేశారో ఆవిడ వచ్చి మీ తాట తీస్తారు. ఖబడ్దార్!! వెళ్ళండి, ఇది మరెక్కడా నేను పొయ్యకముందే గెట్ ద హెల్ ఔట్ ఆఫ్ హియర్" అంది.

ఎంతో స్థిరంగా చెప్పిన తీరుకీ, ఆమె మాటలకీ వాళ్ళు కొద్దిగా బెదిరిన మాట వాస్తవం..

" పదండిరా, ఆంటీ మూడ్ బాగోలేదు, మళ్ళీ చూద్దాం" అంటూ వెనక్కి తిరిగారు.

" పలాయనం పరాజయానికి మొద టి అడుగు" మనసులోనే నవ్వుకుంది సత్య..

" రామ్మా! నీకేమీ భయం లేదు. చెప్పానుగా పెప్పర్ స్ప్రే పెట్టుకో! ఈ ఫోన్ నంబర్లు నీ ఫోన్లో నిన్ననే స్టోర్ చేశాను. అవి సుధారాణిగారిదీ, వారి హెడ్ దీ. అవసరమైతే ఫోన్ చెయ్యమన్నారు. భయపడితే అంతా భయపడతారు. ధైర్యంగా ఉండు, చదువుకో." అంది కూతురిని బస్ స్టాప్ దగ్గరకి తీసుకొస్తూ..

" చూడండి సత్య గారు! నేను, మా వాళ్ళు మీ రక్షణకే ఉన్నాము, కాదనడం లేదు. కానీ మేము వచ్చేలోపుల ఏదైనా జరగరానిది జరిగితే?? అప్పుడు ఎవరిని అనుకొని ఏం లాభం? అందుకే తొలి రక్షణ కల్పించుకోవలసినది మనకు మనమే.

రోజురోజుకీ మారుతున్న దృక్పథాలో, సినిమాలూ, టీ.వీల ప్రభావమో తెలియదు కానీ నేరాలు బాగా పెరుగుతున్నాయి అన్నది కాదనలేని సత్యం. దానికి తోడు టెక్నాలజీ ఒకటి. దానికోసం మనం తయారుగా ఉండాలి కదా! అందుచేత అమ్మాయికి మీరు ధైర్యం చెప్పి, నేను చెప్పినట్టు చెయ్యండి. చూద్దాం ఎవడు నిలబడతాడో? ఎప్పుడైతే మొదటి అడుగే సాగదు అని తెలుసు కుంటాడో చాలా శాతం వెనక్కి తిరుగుతారు. ఒక్కరోజులో జరుగుతుందని కాదు కానీ ఎదుటివాడి కళ్ళల్లో భయం కనబడితే అది మన తొలి విజయమే. ఆపైన మేమెప్పుడూ మీకు అండగానే ఉంటాం కదా!! అంటూ ధైర్యం చెప్పి తనకీ ఆలోచన ఇచ్చిన ఇన్స్పెక్టర్ సుధారాణికి మనసులోనే ధన్యావాదాలు అర్పించింది సత్య.

COMMENTS